క్లుప్తంగా

నేడు గడప గడపకు మనప్రభుత్వం

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల సచివాలయం-1 పరిధిలో వీరరాఘవాపురంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్ వెంకట రమణ ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వివరిస్తారని పేర్కొన్నారు.

మైలవరంలో రేపు...

మైలవరం: ఈ నెల 21వ తేదీ నుంచి గడప గడపకు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిందింది. కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొంటారని కార్యాలయం తెలిపింది. నియోజకవర్గంలోని రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పార్టీ కార్యాలయం పేర్కొంది

1,100 మందికి వైద్యపరీక్షలు



తిరువూరు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరువూరులో ఆదివారం మధుమేహ వ్యాధిగ్రస్తుల ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, మూర్ఛవ్యాధిగ్రస్తులకు వైద్యులు రవీంద్ర, సత్యతేజ, లక్ష్మణరావు, బిందు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. రక్తపోటు, మధుమేహం నియంత్రణకు ఉప్పు, పంచదార వాడకం తగ్గించాలని, వ్యాయామం, నడకతో శారీరక రుగ్మతలను నియంత్రించవచ్చని వైద్యులు సూచించారు. 1,100 మంది రోగులను ఈ శిబిరంలో పరీక్షించినట్లు జనవిజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షుడు పాపారావు తెలిపారు. వైద్యశిబిరాన్ని జేవీవీ ప్రతినిధులు హరికృష్ణ, నాగేంద్రప్రసాద్, గంగాధర్, శరత్ పర్యవేక్షించారు.

నేడు 'స్పందన'

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కారం నిమిత్తం అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు. స్పందనలో ఇచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరిస్తామని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఈ స్పందనలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొంటారని, ప్రజా సమస్యలపై అర్జీలు పెట్టుకుంటే వాటిని పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

బాబురావుకు ఘన నివాళి



విస్సన్నపేట: సోషల్‌స్టడీస్ స్కూల్ అసిస్టెంట్‌గా స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఎల్.బాబురావు అనారోగ్యంతో మృతి చెందటం బాధాకరం అని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులను ఎంపీపీ ఆదివారం పరామర్శించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు పిల్లి రాజేష్, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి కరుణాకర్, ఉపాధ్యాయుడు రత్నాకర్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఎ.కొండూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ కాలసాని నాగలక్ష్మీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొంటారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించిన నివేదికలతో తప్పక హాజరు కావాలని కోరారు.

ఘనంగా షబ్బే మే రాజ్

ఎ.కొండూరు: మండలంలోని కృష్ణారావుపాలెం, కంభంపాడు గ్రామాల్లో శనివారం రాత్రి మసీదుల్లో మత గురువుల ఆధ్వర్యంలో షబ్బే మేరాజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మసీదు ఇమామ్ ఎంఏ ఖాదరి మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు సేవ చేసి వారి దీవెనలు పొందాలన్నారు. చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా తాజ్‌ఖాదరి, ఖాదర్ మొహీద్దీన్, అసదుల్లా, అబ్దుల్లా, ఇస్మాయిల్, కరీముల్లా పాల్గొన్నారు.

జోరుగా తారురోడ్డు నిర్మాణ పనులు

- బోర్వంచ నుంచి యనమదల వరకు నిర్మాణం
- రూ.3.63 కోట్లతో పనులు



బోర్వంచ నుంచి యనమదల వరకు చురుకుగా సాగుతున్న తారు రోడ్డు నిర్మాణ పనులు

నూజివీడు: మండలంలోని బోర్వంచ నుంచి యనమదల వరకు సుమారు ఆరు కిలోమీటర్ల పొడవున తారురోడ్డు నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో పీఎంజీఎస్‌వై కింద రూ.3.63 కోట్లు మంజూరు కాగా ఆ నిధులతో తారు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. బోర్వంచ వద్ద నుంచి అమృతనగర్, రేగుంట మీదుగా యనమదల వరకూ ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. చాలా కాలంగా రహదారిని నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ గతంలో పాలించిన ప్రభుత్వాలు ఇవేమీ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు పంపించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. దీంతో పంచాయతీరాజ్ అధికారులు రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు. లింకురోడ్ల నిర్మాణం వల్ల గ్రామాలు సైతం అభివృద్ధి పథంలో పయనించనున్నాయి.

వ్యవసాయ ఉత్పత్తులు తెచ్చుకోవడానికి..

ఈ రహదారి నిర్మాణం వల్ల ఈ మార్గంలో ఉన్న వందలాది ఎకరాల వ్యవసాయ భూముల్లోకి రైతులు రాకపోకలు సాగించడానికే కాకుండా వ్యవసాయ ఉత్పత్తులను సులువుగా తెచ్చుకునేందుకు మార్గం సుగమమైంది. రేగుంట, కొన్నంగుంట, కొత్తూరు, అమృతనగర్, రేగుంట, యనమదల గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములున్నాయి. మామిడి, మొక్కజొన్న, పత్తి, కూరగాయలు ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటల దిగుబడులను రైతులు ఇళ్లకు చేర్చుకునేందుకు ఇబ్బందులు ఉండవు. అంతేగాకుండా ఈ రోడ్డు నిర్మాణం వల్ల రాబోయే రోజుల్లో వ్యవసాయ భూముల ధరలు కూడా పెరుగుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

ఈ రోడ్డు నిర్మాణం వల్ల బోర్వంచ, కొన్నంగుంట, కొత్తూరు, రామన్నగూడెం, రావిచర్ల, కొత్తరావిచర్ల తదితర గ్రామాల ప్రజలు మైలవరం, యనమదల, బత్తులవారిగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే దూరాభారం సైతం తగ్గుతుంది. అంతేగాకుండా నూజివీడు పట్టణంలోకి రాకుండానే వెళ్లవచ్చు. దీంతో పట్టణంలో కూడా ట్రాఫిక్ తగ్గుతుంది. అత్యవసర సమయాల్లో మైలవరం వైపు నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఈ రోడ్డు మార్గం ద్వారా నూజివీడు పట్టణంలోకి రాకుండా సైతం మళ్లించేందుకు వీలవుతుంది.

వేగంగా రోడ్డు నిర్మాణం



బోర్వంచ నుంచి యనమదల వరకు తారు రోడ్డు నిర్మాణం ఈ ప్రాంత ప్రజలకు వరం. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషి వల్లనే ఈ రోడ్డు నిర్మాణం సాధ్యమైంది. మామిడి కాయలు తోటల్లో నుంచి తెచ్చుకునేందుకు ఎంతో సులువవుతుంది. బోర్వంచ, అమృతనగర్, రేగుంట, యనమదల గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు కృషిని ఎన్నటికీ మరిచిపోరు. ప్రస్తుతం వేగంగా రోడ్డును నిర్మిస్తున్నారు.

– కుంటం ఉదయరాజు, సర్పంచ్ బోర్వంచ

40 వేల కిలోమీటర్లు తిరిగినా లోకేష్ సీఎం కాలేడు

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

జి.కొండూరు: ప్రజాదరణ లేని నారా లోకేష్ 40 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినా సీఎం కాలేడని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్లో 'మా నమ్మకం నువ్వే జగన్' నినాదంతో ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పడమట సురేష్‌బాబుతో కలిసి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు నూతన పథకాలను సైతం వందశాతం అమలు చేసి ముఖ్యమంత్రి తన విశ్వసనీయతను చాటుకున్నారన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానకర్తలుగా గ్రామ వలంటీరు వ్యవస్థను ప్రవేశపెట్టి అర్హత ఉన్న ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందించడంలో సంపూర్ణ విజయం సాధించినట్లు తెలిపారు. ఇదే క్రమంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను నియమించి ప్రజలకు మరింత మేలు చేసేందుకు ముఖ్యమంత్రి పూనుకున్నారని వివరించారు. గ్రామ వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలకు చేర్చడంతో పాటు ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న దుష్టశక్తులను తిప్పికొట్టడంలో గృహసారథులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. మంచికి, చెడుకు జరుగుతున్న ఈ యుద్ధంలో పార్టీ శ్రేణులతో పాటు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు తమ వంతు పాత్ర పోషించి ప్రజలకు మంచి జరిగేలా కృషి చేయాలని కోరారు. ఇటీవల స్థానికత గురించి మాట్లాడుతున్న కొన్ని శక్తులు, స్థానిక వ్యక్తులు ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన సమయంలో దేవినేని ఉమామహేశ్వరరావుకి మద్దతు పలికారని మండిపడ్డారు. పూటకో మాట మాట్లాడే ఈ వ్యక్తులు స్థానికత గురించి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో 20 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.300 కోట్లు కేటాయించగా, సంక్షేమ పథకాల రూపంలో ఇప్పటి వరకు రూ.900 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి 2024లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. అనంతరం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు వారి విధులను ఎమ్మెల్యే వివరించారు.

కనులపండువగా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం



కొండపర్వలో మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): బాలకోటేశ్వర లింగాలస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దివ్య ఆశీస్సులు అందజేశారు.

వెల్వడం(మైలవరం): మహాశివరాత్రి పురస్కరించుకుని మైలవరం మండలం వెల్వడం, మైలవరం, పుల్లూరు తదితర గ్రామాల్లో శివాలయాల్లో శనివారం రాత్రి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైలవరం మండలం వెల్వడం గ్రామంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని కోనేటిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, పితృదేవతలకు తర్పణాలు వదిలి వినాయకుని దర్శించుకున్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బాలకోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

కొండపర్వ (విస్సన్నపేట): మండలంలోని కొండపర్వలో భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి దేవస్థానం వద్ద స్వామి కల్యాత్సవం శనివారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా స్వామి కల్యాణం నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామి కల్యాణం వీక్షించి స్వామి దేవస్థానం సన్నిధిలో జాగరణ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తిరువూరు సీఐ ఆర్.భీమరాజు, ఎస్సై పరిమి కిషోర్ తమ సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ గొట్టిపూళ్ల బుచ్చివెంకట్రామ లక్ష్మీనరసింహారావు, గ్రామ సర్పంచ్ జి రమేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు జి.చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామి దేవస్థానంలో..

స్థానిక గంగాపార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానంలో స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఆగిరిపల్లి: స్థానిక వరాహ పుష్కరిణి వద్ద ఉన్న బాలాత్రిపుర సుందరిదేవి సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు దేవులపల్లి శ్రీనివాస్ కనుల పండువగా జరిపించారు. అదేవిధంగా కనసానపల్లిలోని బాలా త్రిపుర సుందరీ సమేత చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి విశేష అభిషేకాలతో శివరాత్రి వేడుకలు ముగిశాయి.

చాట్రాయి: మహాశివరాత్రిని పురస్కరించుకుని చాట్రాయిలోని మహా లింగేశ్వర ఆలయంలో శనివారం రాత్రి శివ పార్వతులకు ఘనంగా కల్యాణం నిర్వహించారు. ఆదివారం స్వామి వార్ల ఉత్సవమూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించారు.



తుమ్మలపాలెం బాలకోటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వసంత



ముక్తేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

పార్వతీ పరమేశ్వరుల నగరోత్సవం



తిరువూరు: మహాశివరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా ఆదివారం తిరువూరులో పార్వతీ పరమేశ్వరులకు నగరోత్సవం నిర్వహించారు. చంద్రమౌళీశ్వరాలయం, రామలింగేశ్వరాలయాలలో ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. రామలింగేశ్వరాలయంలో ఐదు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ తిరుమలశెట్టి వేణు పర్యవేక్షించారు.

వేంకటాచలస్వామికి సహస్ర దీపాలంకరణ



తిరువూరు: స్థానిక పాతతిరువూరు వేంకటాచలస్వామి దేవస్థానంలో ఆదివారం మాఘ మాస శ్రవణా నక్షత్ర సందర్భంగా సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు, సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో వేంకటాచలస్వామికి అష్టోత్తర శతనామార్చన అనంతరం సహస్ర దీపాలంకరణ కార్యక్రమం జరిపారు.

దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు సభ్యుడికి సన్మానం



తిరువూరు: విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన పాలకమండలి సభ్యుడిగా నియమితులైన దేవిశెట్టి బాలకృష్ణను తిరువూరు ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో ఆదివారం సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం, తిరువూరు నియోజకవర్గ యాదవ సంఘం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలకృష్ణను పలువురు సత్కరించారు. ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు గజ్జల సీతారామారావు, గుడిమెట్ల మురళి, కంచర్ల ముత్యప్రసాద్, యాదవ సంఘ నాయకులు యరదేశి రామారావు, పాపారావు, పదిలం శ్రీను, పాలెం గోపాలరావు, దొంగల నరసింహారావు పాల్గొన్నారు.

వేగంగా అదనపు తరగతి గదుల నిర్మాణం



నూజివీడులోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్లో చురుగ్గా సాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణం

నూజివీడు: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్, జెడ్పీ బాలికల హైస్కూల్‌లలోని అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నాడు-నేడు ఫేజ్-2 కింద ప్రభుత్వం నిధులను మంజూరు చేయడంతో తరగతి గదుల నిర్మాణ పనులను చేపట్టారు. నేడు-నేడు ఫేజ్-1లో హైస్కూళ్లలో నూతన బెంచీల ఏర్పాటు, విద్యుత్, రంగులు, ప్రహరీల నిర్మాణం తదితర పనులను చేపట్టి మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. మౌలిక సదుపాయాలు కల్పించడంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతో పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా తరగతి గదుల నిర్మాణానికి నిధులను మంజూరు చేసింది. దీనిలో భాగంగా పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.48 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో పాఠశాల స్థాయిలో ఏర్పాటైన కమిటీ తరగతి గదుల నిర్మాణాన్ని చేపట్టింది. ఈ భవన నిర్మాణం పూర్తయితే దాదాపు 10 తరగతి గదులు అందుబాటులోకి రానున్నాయి. దీంతో విద్యార్థులకు తరగతి గదుల కొరత కూడా తీరనుంది. అలాగే జెడ్పీ బాలికల హైస్కూల్‌లో రూ.95 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను నిర్వహిస్తున్నారు. ఈ హైస్కూల్‌లో రాష్ట్ర ప్రభుత్వం బాలికల కోసం జూనియర్ కాలేజీని సైతం మంజూరు చేసి నిర్వహిస్తోంది. ఇక్కడ కూడా విద్యార్థుల సంఖ్య పెరగడంతో ప్రభుత్వం అదనపు తరగతి గదులను నిర్మిస్తోంది. ఈ నిర్మాణ పనులను హెచ్ఎం సారథ్యంలోని కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుంది.

గృహసారథులు వారధుల్లా పనిచేయాలి



గృహ సారథుల కిట్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా గృహసారథులు పనిచేయాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. గ్రామాల్లో నియమితులైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు 'మా నమ్మకం నువ్వే జగనన్న' నినాదంతో ఆదివారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకుడు పడమటి సురేష్ బాబుతో కలసి ఎమ్మెల్యే వసంత పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏమి చేశారు, మన ప్రభుత్వం ఏమి చేసింది, గత ప్రభుత్వం డ్వాక్రా మహిళలు, రైతులకు రుణ మాఫీ ఇవ్వకుండా మభ్యపెట్టిన వివరాలు ఇంటింటికీ తెలియజేయాలన్నారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, దుర్గమ్మ ఆలయ ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు చింకా శ్రీనివాసరావు, బ్యూటిఫికేషన్, గ్రీనరీ డైరెక్టర్ పోలగంగు రాణి, పీఏసీఎస్ చైర్మన్ ఎం.శివారెడ్డి, బీసీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు నిడుముక్కల శివశంకరరావు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద అన్నసమారాధనలు



డీఏఆర్ కళాశాలలో అన్నదాన కార్యక్రమం

నూజివీడు: పట్టణంలోని డీఏఆర్ కళాశాల పక్కన ఉన్న కోట శివాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని జరిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆదివారం డీఏఆర్ కళాశాల ఆవరణలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదానానికి భక్తులు వందల సంఖ్యలో విచ్చేసి స్వామి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఏర్పాట్లను నిర్వాహకులు పగడాల సత్యనారాయణ, చారుగుండ్ల శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం

పట్టణంలోని బస్టాండు వద్ద ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామికల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి ఉమాకుమార్ శివాచార్య బ్రహ్మత్వంలో నిర్వహించిన ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

రవాణా రంగ కార్మికుల జీవనంపై కేంద్రం దాడి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత చట్టం - 2020 తీసుకొచ్చి రవాణా రంగ కార్మికుల జీవనంపై దాడి చేసిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్ చెప్పారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఇఫ్టూ నాయకుడు కె.రవీంద్ర అధ్యక్షతన ఆదివారం ఇఫ్టూ విజయవాడ నగర 5వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్న ఆటో, రవాణా రంగ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడిని ప్రతిఘటించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఆటో, రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. దేశ ప్రజల సొమ్మును కొల్లగొడుతున్న గౌతం అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు అన్ని రంగాలను నిబంధనలను అతిక్రమించి నరేంద్ర మోడీ ప్రభుత్వం అక్రమంగా కట్టబెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఎల్.రమాదేవి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు తదితరులు మాట్లాడారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



అగ్నికి ఆహుతైన ఇంటిలో బాధితులు

చాట్రాయి: మండలంలోని పోతనపల్లి పడమటి తండాలో ఆదివారం సాయంత్రం ధారావత్తు వెంకటేశ్వరరావుకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. ఇంట్లో ఉన్న రూ.రెండు లక్షల నగదు, కాసు బంగారం, 10 బస్తాల ధాన్యం, దుస్తులు, వంట సామగ్రి కూడా కాలిపోయాయి. మొత్తం రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు.

ఉపయోగకరంగా ఆన్‌లైన్ బోధన

- ట్యాబ్‌ల వినియోగంతో సులభతరంగా అవగాహన
- విద్యార్థి కేంద్రంగా రూపొందిన పాఠ్యప్రణాళిక
- ఉపాధ్యాయుల పర్యవేక్షణ



ట్యాబ్‌లతో ఎనిమిదో తరగతి విద్యార్థులు (ఫైల్)

తిరువూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందించేందుకు ప్రభుత్వం ఎనిమిదవ తరగతి విద్యార్థులకు సరఫరా చేసిన ట్యాబ్‌లు ప్రయోజనకరంగా ఉంటున్నాయి. తిరువూరు నియోజకవర్గంలోని 32 ప్రభుత్వ పాఠశాలల్లో రెండు వేల మంది విద్యార్థులకు, 200 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను విద్యాశాఖ అందజేసింది. లెక్కలు, సైన్స్, సోషల్ సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులు బైజూస్ రూపొందించిన ఆన్‌లైన్ పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధించడంతో పాటు ఆయా అంశాల్లో విద్యార్థుల అవగాహన సామర్థ్యాలను రోజూ నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రతి పాఠ్యాంశాన్ని 2, 3 వీడియోలలో నిక్షిప్తం చేసి ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారు. గతంలో వీసీఆర్, డీసీఆర్ తరగతుల్లో ఆన్‌లైన్ పాఠాలు బోధించే ఉపాధ్యాయులు ఇప్పుడు ట్యాబ్‌లలో ముందుగా రూపొందించిన పాఠాలను విద్యార్థులకు బోధించాల్సి ఉంది.

నిరంతర పరిశీలన

విద్యార్థులు రోజూ తరగతి గదిలో బోధించిన ఆన్‌లైన్ పాఠ్యాంశాలను ఏ మేరకు అవగాహన చేసుకున్నాడో ట్యాబ్‌లో నమోదవుతుంది. ఈ అవగాహన సామర్థ్య శాతాన్ని ఉపాధ్యాయుడు నమోదు చేసి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధించాల్సి ఉంది. అంతర్గత పరీక్షల్లో డీ గ్రేడ్ వచ్చిన విద్యార్థులకు రోజూ గంట సేపు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు వారి సామర్థ్యాలు మెరుగుపరచాల్సి ఉంటుంది.

సాంకేతిక లోపాల నివారణకూ చర్యలు

ట్యాబ్‌ల వినియోగంలో అవగాహన లేని విద్యార్థులు సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటే వాటిని పరిష్కరించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సమస్య తెలియజేసినా పరిష్కరిస్తారు. ప్రతి విద్యార్థి ట్యాబ్‌కూ ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వడంతో పాటు బార్‌కోడ్ కేటాయించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా పాఠ్యాంశాలు బోధించడం ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తూ నాణ్యమైన బోధనకు సహకరించాలి.

– సోమశేఖర నాయక్, ఎంఈఓ, తిరువూరు

రేపు హుండీ ఆదాయం లెక్కింపు

బలివే (ముసునూరు): మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బలివే రామలింగేశ్వరాలయానికి హుండీల ద్వారా లభించిన ఆదాయాన్ని మంగళవారం లెక్కిస్తామని ఈఓ విశ్వేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం నుంచి ఆలయం వద్ద దేవదాయ, రెవెన్యూ అధికారుల సమక్షంలో హుండీల లెక్కింపు నిర్వహిస్తారని పేర్కొన్నారు.